స్కెచ్

# రేడియో చెప్పిన 'పొరపాటు'

రంధి సోమరాజు

అబ్బబ్బ, ఏమి ఎలక్షన్లోయ్! ఏమి ఎలక్షన్లు! బ్రహ్మాండంగా ఉన్నాయి కదూ? నిజంగా బ్రహ్మాండాన్ని బ్రద్దలు చేసేస్తున్నాయి. చూడవోయ్ మూడు. టైమెంతయిందో గూడా. ఇంకెంతసేపు ప్రాణాల్ని ఉగ్గబట్టుక కూర్చోవాలో. అబ్బబ్బ—చస్తున్నామోయ్ చస్తున్నాం, వెధవ పంక్చ్యువాలిటీతో. రేడియోకూడా ఈ పంక్చ్యువాలిటీ ఎందుకోయ్? అర్థరహితంగాని! మనకిలేంది దానికెందుకు చెప్పూ? మనమెట్లాగో మన రేడియో అట్లా లేకపోవడం చాలా ఆక్షేపణీయమైన అంశమోయ్! దీని తస్సాదియ్యా సరిగ్గా ఎంత టైముకంటె అంత టైముకేకదా. హేమిటే, ఇది మారాలి. ప్రతిదాన్లోనూ మార్పురావాలి. అయితే ఈ పాటికి మావాడు మా స్వతంత్రా కేండేటు—విజయోత్సవాలతో ఊరేగుతూండటం ఎంతద్భుతంగా ఆ మహానగరంలో ఎట్లా సాగుతూ ఉంటుందో అబ్బబ్బా ఈ మూడురోజులూ అక్కడ నేను లేనందుకు వాళ్ళకెంతఇబ్బందయిందో కాని—కనీసం ఇవ్వాళటి ఊరేగింపుకైనా అందుకోలేక పోయేనోయ్. ఎన్ని పూల దండలు మావాడి మెడలో ఉంటాయనుకున్నావ్! ఛీ ఛీ ఈ పాడు భగవంతుడికి ఈ ప్రపంచంలో ఎప్పుడూ జరగని, ఎక్కడా కని విని ఎరగని ఇంత పెద్దత్తున ఎలెక్షన్లు వస్తాయని తెలిసేడవలేదనుకుంటానోయ్. దూరదృష్టిలేని దద్దమ్మ కదూ? మావాడి దసలే పొట్టి మెడ. సుమారు ఓ గజమైతైనా ఆ మెడకాయ లేకపోతే ఏమాత్రం దండలు పడతాయి చెప్పూ?

ఇంతకీ ఆ మహోద్భుతమైన ఊరేగింపు ఎట్లా సాగుతుందోగాని చూడలేక పోయానోయ్. మొత్తంమీద చూడలేక పోయాను. ఇప్పుడు మనకు టెలివిజన్ ఉంటే ఎంత రమ్యంగా ఉంటుందంటావ్? ఉండాలోయ్ ఉండాలి. ఇలాంటివన్నీ ఉండాలి. మావాడు ప్రభుత్వంలో అడుగుపెట్టడమే తడవుగా టెలివిజన్ ఏర్పాట్లకు ముందడుగువేయమని నేను తప్పక ఆదేశిస్తానోయ్. ఇది నిజంగా అద్భుతమైన ఐడియా కదూ? అసలు ముందడుగు వెయ్యాలి, వెయ్యాలి అనేవాళ్ళేగాని వేసేవాడు ఒక్కడూ కనిపించడు. మరి ముందడుగు ఎట్లా వెయ్యాలో మావాడిచేత వేయించి నేను చూపకపోతే చూడవోయ్. వెధవ మనదేశం ఎంత వెనకపడిపోయింది! అసలు ముందడుగు వేయలేనివాళ్ళంతా ముందుకొచ్చేస్తున్నారు! మరి వెనకబడక చస్తుందా ఏమిటి? అదిగో అట్లా నవ్వుతావేం? నిజంగా మనదేశం వెనకబడిలేదంటావు? అయితే ఎందుకట్లా పళ్ళికిలిస్తావ్? ఓహో! మా వాడు మావాడు అంటున్నాననా? అలాగంటాను కాని నాకసలు ఈ షణ్మాత్రమూ మావాడని బంధుప్రేమగాని, వాడు మా కులానికి చెందినవాడని కులాభిమానంకాని లేనేలేదోయ్. నమ్ముతావో నమ్మవోగాని మొన్న నెహ్రూపండితుడు వచ్చి చెప్పటంతో నాకు రాష్ట్రాభిమానం కూడ పూర్తిగా చచ్చిపోయింది. ఇంకా కమ్యూనిస్టుల ప్రపంచ కార్మికులంతా ఏకం కావాలనే స్లోగన్సుతో నాలో పూర్తిగా దేశాభిమానం కూడా అడుగంటిపోయింది నిజానికి నాకిప్పుడు భోజనంమీద తప్ప ఇంక దేనిమీదా అభిమానం లేదోయ్. ఇలాంటి అభిమానాలుండటం ప్రపంచకానికి అనర్థదాయకమోయ్ బ్రదర్. అభిమానాలు అవతలపెట్టి, చక్కని ప్రణాళికలు ముందుకుపెట్టి, తిన్నని బాటలు వేసుకపోతే చల్లని బ్రతుకులు బ్రతకమటోయ్! అసలు మా స్వతంత్రా అభ్యర్థికి ఏ పార్టీవాళ్ళతోనూ భేదాభిప్రాయంలేదు, ఏ పార్టీ ప్రభుత్వాన్ని నిర్మిస్తే ఆ పార్టీలోచేరి, దానితో చేతులుకలిపి ఐకమత్యాన్ని కలిసికట్టుతనాన్ని ప్రకటించడం మావాడి ఉన్నతాశయం. ఈ ఆశయం ఆసహ్యకరమైనదనికాని, అచరణీయమైనది

కాదనిగాని ఆనేవాళ్ళకు ఏకమత్యంలో కాస్త కూడ నమ్మకం లేదన్నమాట! నేను మా వాడికి గట్టిగా చెప్పాను. నువ్వు ఏమీ ఆశ్చర్యపడకు. కాస్తకూడ వెనుకంజవేయకు. ఎందువల్లనంటే ఈ పార్టీలలో ఏ ఒక్కదానికీ ఓ పాలసీ ఏడవలేదు. అంచాత నీకు, స్వతంత్రా అభ్యర్థివైన నీకు, ఓ పాలసీ ఉండాలని గుండె బద్దలు చేసుకోకు. కావలిస్తే అందరి పాలసీలు నీవేనని ఘంటాభజాయించి, కంఠాన్ని తెగేదాకా సాగదీసి ఎలుగెత్తి—ఈ భువిలో ఏది సత్యం? ఏది నిత్యం? ఏదిధర్మం? ఏది అధర్మం? ఓ మహాత్మా! అనుకుంటూ ఆ స్లోగను అరగదీస్తూ ప్రచారం ఏ మాత్రం అపచారం అనుకోకుండా హుషారుగా సాగించవోయ్— అని ఉపదేశించా. ఈ ఉపదేశానుసారం మా వాడు నడచుకొనే ఉంటాడు. అందుకనే వాడు తప్పక గెలుస్తాడని నా అభిప్రాయం. అసలు వాడిచ్చే ఉపన్యాసం ఎంత తెలివిగా ఆరంభింపబడుతుందనుకున్నారు! ఆ ఉపన్యాసం ఆరంభిస్తూ. "అమ్మలారా! అయ్యలారా!" అని తియ్యగా సభికుల్ని సంబోధిస్తాడు. దానితో ఏ తల్లికి, ఏ తండ్రికి మాతృ పితృ వాత్సల్యాలు పొంగిపోవు? వెధవది మిగతా వాళ్ళలాగ "సోదర సోదరీమణులారా" అంటే. "ఒరే తమ్ముడూ నీకెందుకురా ఈ వెఱ్ఱిమొఱ్ఱి వేషాలు" అని వాళ్ళు పెద్దరికం తీసుకొని ఆ చెప్పేవాడి నోరు నొక్కేస్తారు ఇక మిగతా—మావాడి ఉపన్యాసం సంగతి చెప్పనే అక్కర్లేదు. అందులో ప్రజానీకానికి కావలసిన ఉప్పూ, చింతపండు, పప్పూ బెల్లం సమస్తమూ లభ్యమవుతాయి. ఇక తింటే గారెలు తినాలి, వింటే భారతం వినాలి అన్న దానికెంత ఈడు జోడుగా మావాడు 'అడిగితే ఆంధ్రరాష్ట్రాన్నే అడగండి—ఇస్తే స్వతంత్రా అభ్యర్థికే ఓట్లు యివ్వండి' అన్న స్లోగన్సు తయారుచేసి కుర్రాళ్ళ చేత మేకల్లా అరిపించాడు. అయితే మొదట్లో ఈ కుర్రాళ్ళు దొరకడం బ్రహ్మ ప్రళయం అయింది. అసలు ఈ అగచేట అబ్బాయిలు మా వాడికి డబ్బిట్టినా దొరక్కపోవడం ఇతర పార్టీలవాళ్ళకు ఊరకనే అగడదారి చేయడానికి తయారవడం చూస్తే మా వాడికి ఒళ్ళు మండింది. ధనమూలం ఇదం జగత్తు అన్న వాళ్ళను నరకాలనిపించింది. కానయితే ఏం చేస్తాడు. ఇవి నరికేరోజులు కావుకదా! కేవలం ఇవి అరిచేరోజులే కాబట్టి మావాడు కొన్నాళ్లు ఎవ్వరూ దొరక్క కుత్తుక పోగొట్టుకోక తప్పిందికాదు. గొంతుకపోతే మళ్ళీ వస్తుందేమోగాని, మనిషిపోతే మళ్ళీ రాడని మావాడు జాగ్రత్తగా చేతిలోపడ్డ మనిషికి గట్టి సంకెళ్ళు వేసి బిగించాడు. అంగాత్ర మావాడు నెగ్గడం షూర్. ఇతర కేండేట్సంతా వాడిముందు దిక బలాదూర్. అదిగో మైకు ముందు. అదిగో చెప్తున్నాడు. అలా మెల్లగా తాపీగా చెప్తాడేం? త్వరగా చెప్పవయ్యా మొగుడా అబ్బ! మా నియోజకవర్గం ఇంకా రాదేం ఖర్మం! ఆ అదిగో చెప్తున్నాడు. ఆ, ఆ ఏమిటీ! మా వాడిది పోయిందా! ఏమిటి డిపాజిట్టుకూడా నా? వట్టిది శుద్ధ అబద్ధం. ఇది ఇట్లా జరగదు ఏదో అన్యాయం తప్పకుండా జరిగి ఉంటుంది. ఓయ్ లేడిగారూ ఆగు. ఏమిటీ నువ్వు అన్నది? పొరపాటున చెప్పలేదు కదా? నిజంగా తప్పు చదివి ఉంటావు. ఇంకోసారి చదివిచూడు. వినబడటం లేదా నీకు? చెవుల్లేవూ? ఏయ్ లేడియో నీకు వెధవసొద—నీసొదే కాని మా మాట వినిపించుకోవేం? ఛీ ఛీ.

చిన్నతనంలో బొమ్మలాట నేర్చివుండుటచేత లోకమనే రంగంలో చిత్రకోటి రీతులను ఆటాడే మనుషులనే పాత్రముల సొగసునే కనిపెట్టడము నాకు అలవాటైనది. సొగసులేని మనిషేవుండడు. స్నేహమూ—ప్రేమా—అనే అనాది అయిన్నీ యెప్పటికీ సరికొత్తగా వుండే రెండు వెలుగులను నరులమీద కాంచి తిప్పి కాంచితే వింతవింత సొగుసులు బయలుదేరుతవి. అసూయ అనే అంధకారంలో అంతా యేక నలుపే!—గురజాడ అప్పారావు